# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు


## చేపల మృత్యువాత



**పాలకుర్తి వాణి, పెద్దవంగర :** మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలానికి చెందిన ఏడవెల్లి మధు, రమేష్, శ్రీను, కృష్ణ, బొత్తల తండాకు చెందిన సోమన్న, బాలాజీ, యాకన్న రాజన్న అనే రైతులు చిన్న చిన్న కుంటలు తీసి కొర్రమీను చేపలను పెంచుకుంటున్నారు. అయితే సోమవారం ఉదయం మూడు గంటల సమయంలో వర్షం పడటంతో నీటి కుంటలో ఉన్నట్లుండి ఒక్కసారిగా చేపలన్నీ చనిపోయి నీటి పై తేలాడుతున్నాయి. మంగళవారం తెల్లవారే సరికి ప్రత్యక్షమైన ఈ సంఘటనను చూసిన తండా వాసులు విస్మయం వ్యక్తం చేశారు. చెరువులో ఎవరైనా ఏదైనా విషమందు కలిపారా? చేపల మృతికి ఏదైనా చల్లారా? అని తండా వాసులు అనుమానిస్తున్నారు.


సంపుటి : 01 | సంచిక : 36 | వరంగల్ | బుధవారం, 15 అక్టోబర్ 2025 | పేజీలు : 02




# అందరి అభిప్రాయాలను పార్టీ తప్పక గౌరవిస్తుంది

- **వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య**
- **ముగిసిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం**

పాలకుర్తి వాణి, హనుమకొండ : సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంతో క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ నాయకులు, పార్టీ ప్రతినిధుల అభిప్రాయాలను పార్టీ హైకమాండ్ పరిశీలకులు తెలుసుకున్నారు. డీసీసీ అధ్యక్షుడి నియామకంపై ఏఐసీసీ నేతృత్వంలో టీపీసీసీ ఆధ్వర్యంలో తుది నిర్ణయం తీసుకుంటుందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. వరంగల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమానికి ఏఐసీసీ పరిశీలకులు నవ జ్యోతి పట్నాయక్, మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత పునర్నిర్మాణం, బలోపేతం దిశగా కార్యకర్తలు, నాయకుల సమష్టి అభిప్రాయాల ఆధారంగా అధ్యక్షుడి ఎంపిక జరుగుతుందన్నారు. అభిప్రాయాలను గౌరవించి, పార్టీ ఐక్యతను బలపరుస్తూ ముందుకు సాగుతామని తెలియజేసారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు తప్పకుండా పదవులు వస్తాయని ఎంపీ పేర్కొన్నారు.



## మాగంటి సునీతకు బీఫామ్ అందజేసిన కేసీఆర్

**పాలకుర్తి వాణి, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాగంటి సునీత గోపీనాథ్ కి పార్టీ అధినేత కేసీఆర్ బి ఫామ్ అందజేశారు. ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరపున 40 లక్షల రూపాయలు చెక్కు ను అందించారు. దివంగత మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## 18న గ్రూప్-2 అభ్యర్థులకు నియామక పత్రాలు

**పాలకుర్తి వాణి, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గ్రూప్2 కొలువులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 18న హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో జరుగనుంది. మొత్తం 782 మంది గ్రూప్2 అభ్యర్థులు నియామక పత్రాలు స్వీకరించనున్నారు. ఈ కార్యక్రమం సజావుగా జరిగేలా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహించారు. అయితే, సర్టిఫికెట్ల పరిశీలనను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అలాగే రెవెన్యూ, హోమ్, జీఏడీ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు.



## తండాలు, గూడెంలకు మహర్దశ

- **రహదారుల అభివృద్ధి నిధులు మంజూరు**

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కృషితో పాలకుర్తి నియోజకవర్గంలోని గిరిజన తండాలు, శివారు గూడెంలకు మహర్దశ పట్టనుంది. రూ.24.30 కోట్లతో బీటీ రోడ్లు మంజూరయ్యాయి. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఎమ్మెల్యేకి మంజూరి పత్రాలను హైదరాబాదులో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని ఆప్యాయంగా స్వాగతిస్తూ, చెల్లమ్మ, బాగున్నావా అని స్నేహపూర్వకంగా పలకరించారు. ఎమ్మెల్యే మంత్రి సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

# డిజిటల్ విద్యపై టీచర్లకు అవగాహన



**పాలకుర్తి వాణి, జనగామ :** విద్య రంగాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు డిజిటల్ విద్యపై అవగాహన పొందాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఉన్న ఏకశిల బిఈడి కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో డిజిటల్ లిట్రసి పై ఫిజిక్స్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించేందుకు మూడు రోజులపాటు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమం లో విద్యాశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యా బోధన కూడా మారాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అందుకు ఉపాధ్యాయులు 6వ తరగతి నుండే కంప్యూటర్ విద్యపై బోధించాల్సి ఉన్నందున డిజిటల్ విద్యపై పూర్తిస్థాయిలో పరిజ్ఞానం పొందాలన్నారు. డిజిటల్ విద్యా ద్వారా బోధన సులువుగా చేయవచ్చునని విద్యార్థులకు విలువలతో కూడిన విద్య కూడా ప్రస్తుత విద్యార్థులకు బోధించాల్సిన కర్తవ్యం ఉపాధ్యాయులకు ఉందని దిక్సూచి కార్యక్రమంలో భాగంగా ప్రతి పాఠశాలలో నిర్వహించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏఎమ్ఓ శ్రీనివాస్ మాస్టర్ ట్రైనీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనుల పరిశీలన



**పాలకుర్తి వాణి, జనగామ :** జనగామ మండలం పెంబర్తి గ్రామం వద్ద రూ.5 కోట్లతో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి భవన నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ భాషా సందర్శించి పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతంగా జరగాలని జాప్యం తగదన్నారు. పనులు నాణ్యతాపరంగా చేపట్టే విధంగా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కలెక్టర్ వెంట పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, సహాయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంజిత్ ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసిన కడియం

**పాలకుర్తి వాణి, స్టేషన్‌ఘన్‌పూర్:** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని, అందుకే సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరు మీదనే అమలు చేస్తుందని ఎమ్మెల్యే కడియం శ్రీహరి , వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తెలిపారు. ఎస్ కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణి కార్యక్రమానికి వారితోపాటు జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 256 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు. అలాగే డిఆర్ డిఏ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు వ్యవసాయ మోటార్లను పంపిణి చేశారు. కార్యక్రమంలో జనగామ, హన్మకొండ జిల్లాల హౌసింగ్ పీడీలు మాత్రు నాయక్, హరికృష్ణ, స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో వెంకన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, డిఈలు, ఏఈలు, ఎంపిడివోలు తదితరులు పాల్గొన్నారు.



## ఆలయంలో పెరుగుతున్న పని భారం

### మంత్రి కొండ సురేఖకు వినతిపత్రం




పాలకుర్తి వాణి, పాలకుర్తి : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం నుండి రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖలో అడిషనల్ కేడర్ స్ట్రెంత్ సాంక్షన్ లేక పరిపాలన చాలా ఇబ్బందిగా మారిందని,.ఉన్న వారికి అదనపు బాధ్యతలతో పనిభారం భరించలేక పోతున్నారని తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భేతి రంగారెడ్డి ఉద్యోగులు కలిసి దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖకు వినతి పత్రం సమర్పించారు. దేవాదాయ శాఖలో వేల కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని,.ఒక్కో అధికారికి 10 నుండి 25 దేవాలయాల బాధ్యతలు ఉండడంతో పరిపాలన చాలా ఇబ్బందిగా మారిందని తెలిపారు. గ్రేడ్ 1,గ్రేడ్2,గ్రేడ్3 కార్యనిర్వహణాధికారుల పోస్టులు రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థికభారం లేకుండా దేవాదాయ శాఖ ఈ.ఏ.ఎఫ్ ద్వారా రాష్ట్ర ఖజానా కు చెల్లించే విధంగా 190 శాంక్షన్ కోసం దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జేఏసీ,దేవాదాయ కమీషనర్,ప్రిన్సిపల్ సెక్రటరీ వినతి మేరకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ సహకారంతో ఆర్థిక శాఖ అనుమతి ముఖ్యమంత్రి కార్యాలయం నుండి నుండి కూడా అనుమతి పొంది ఉన్నదని గుర్తు చేశారు.ఈ గుర్తు చేశారువారంలో జరగనున్న మంత్రి మండలి లో ముఖ్యమైన అంశం గా చేర్చి రాష్ట్ర మంత్రి మండలి లో 190 కార్య నిర్వహణ అధికారుల పోస్టుల తీర్మానం చేయించాలని హన్మకొండలో మంత్రి నివాసం లో తెలంగాణ రాష్ట్ర అర్చక ఉద్యోగ జేఏసీ కన్వీనర్ డి.వి. అర్ శర్మ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బేతి రంగారెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షులు తక్కర్సు సత్యం ,శ్యాం కుమార్, జైపాల్ రెడ్డి,వెంకయ్య, ఓమ్ ప్రకాష్ లు కలిసి వినతి పత్రం అందజేశామన్నారు.ఈ సందర్భంగా మంత్రి తప్పనిసరిగా ఈ సారి జరగబోయే మంత్రి మండలి సమావేశంలో 190 గ్రేడ్1,2,3 కార్యనిర్వహణాధికారుల పోస్టుల శాంక్షన్ కు సంబంధించిన తీర్మానం చేయిస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారని అన్నారు.

## 15 నుంచి సదరం క్యాంపులు

**పాలకుర్తి వాణి, జనగామ:** జనగామ జిల్లాలోని వివిధ రకాల నూతన వికలాంగులు, రెన్యూవల్ ఉన్నవారు మీ సేవలో యూడిఐడి వెబ్సైట్ లో స్లాట్ బుకింగ్ చేసుకున్నవారు రసీదులో ఉన్న ఫోన్ నెంబర్ కు మెసేజ్ వచ్చిన తేదీలలో జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి లో ఏర్పాటు చేసిన సదరం శిబిరానికి హాజరుకావాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారిణి వసంత కోరారు.
ఈనెల 15, 16, 17, 22, 23, 24, 25, 28, 29, 30, 31వ తేదీలలో ఆర్థో, దృష్టి, వినికిడి లోపం, మానసిక, తలసేమియా, క్రానిక్ న్యూరాలజీ, సంబంధిత వికలాంగులకు డాక్టర్ లచే క్యాంపులు నిర్వహించబడు తుందన్నారు. కొత్తవి 419 ఉండగా, రెన్యూవల్ 81 ఉన్నాయని మొత్తంగా 500 మందికి అవకాశం ఉన్నదన్నారు. యుడిఐడి సదరం స్లాట్ బుకింగ్ కు మీ సేవ లో రూ.35 లు మాత్రమే చెల్లించాలని, సదరం సర్టిఫికెట్ లో 40 శాతం కన్నా తక్కువగా ఉండి రిజెక్ట్ అయిన వికలాంగులు మీ సేవలో యుడిఐడి వెబ్సైట్లో కొత్తగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నదన్నారు. ఫోన్ కు మెసేజ్ వచ్చినవారు డాక్టర్ రిపోర్టులతో ఆధార్ కార్డు ఫోటో మీసేవ రసీదు తో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన శిబిరానికి హాజరు కాగలరని తెలియజేశారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 8008202287 ను సంప్రదించాలన్నారు.

## పాఠశాలల పర్యవేక్షణ బృందాల ఏర్పాటు విరమించుకోవాలి

### డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షరీఫ్



**పాలకుర్తి వాణి, పాలకుర్తి టౌన్ :** పాఠశాలల పర్యవేక్షణ కొరకు జిల్లా స్థాయిలో ఉపాధ్యాయులతో పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసే చర్యలను విరమించుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జనగామ జిల్లా అధ్యక్షులు ఎం డి షరీఫ్, ప్రభుత్వం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్ప రాంరెడ్డి తో కలిసి మాట్లాడారు. సర్వీస్ నిబంధనలను రూపొందించి ఎంఈఓ, డిప్యూటీ ఈఓ, జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టులను భర్తీ చేసి పటిష్టమైన పర్యవేక్షక విధానాన్ని అమలు చేయకుండా ఉపాధ్యాయులతో పర్యవేక్షక బృందాలను ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్థాయిల్లో మొత్తం 299 పర్యవేక్షణ బృందాల ఏర్పాటుకు సూచనలు చేస్తూ పాఠశాల విద్యా సంచాలకులు ఆర్ సి నం 70/ జనరల్/2025 తేది 10.10.2025 ఉత్తర్వులను విడుదలచేశారన్నారు. దీనితో 1473 మంది ఉపాధ్యాయులు సంవత్సర కాలంపాటు విద్యా బోధనకు దూరమవ్వడం వలన విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికే వివిధ రకాల శిక్షణలు, కార్యక్రమాలు, రిపోర్టుల కారణంగా పాఠశాలల్లో విద్యా బోధన సాఫీగా జరిగే పరిస్థితి లేకాపోవడమే కాకుండా వందలాది మంది ఉపాధ్యాయులు జిల్లా విద్యా కార్యాలయాల్లో, ఎం ఆర్ సి లలో, సమగ్ర శిక్ష అభియాన్ లో వివిధ స్థాయి అధికారులుగా డిప్యుటేషన్లో పనిచేస్తూ విద్యాబోధనకు దూరమయ్యారని, ప్రస్తుత చర్యతో పాఠశాల విద్యా వ్యవస్థ మరింతగా కుంటుబడే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో పాఠశాలల పర్యవేక్షణ బృందాల ఏర్పాటు చర్యలను ప్రభుత్వం విరమించుకుని, ఉపాధ్యాయులను తరగతి గదిలో విద్యాబోధనలో నిమగ్నమయ్యేలా చూడాలని కోరినారు.

## నేడు పాలకుర్తిలో ఎమ్మెల్యే పర్యటన

**పాలకుర్తి వాణి, పాలకుర్తి :** పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను 15 వ తేదీన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభం చేయనున్నారు. ఉదయం 08:00 గంటలకు పాలకుర్తి మండలంలోని తొర్రురు (జె) గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత తీగారంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, వాల్మీడి గ్రామంలో ఎఫ్ఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ఉదయం 09:30 గంటలకు కొడకండ్ల మండల కేంద్రంలోని ఏఎంసీ మార్కెట్ లో, 10 గంటలకు రామవరం గ్రామంలో వనిత టీ స్టాల్ ని ప్రారంభించనున్నారు. 11:00 గంటలకు దేవరుప్పుల మండలంలోని కామారెడ్డి గూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నారు.

Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341